

**రూ.2,500 గిన్నె చూపించి..**
ముగ్గురు వ్యక్తులు మోసగాళ్ల అవతారమెత్తి రూ.2,500 విలువ చేసే రాగి గిన్నెకు అతీంద్రియ శక్తులున్నాయని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.25 లక్షలు కాజేశారు. -10లో



**కంటైనర్ స్విమ్మింగ్ పూల్స్**
ప్రీ–ఫ్యాబ్రికేటెడ్ స్విమ్మింగ్ పూల్స్ వచ్చేయి. గదిలో, బాల్కనీలో మనకు నచ్చిన చోట వీటిని ఏర్పాటు చేసుకునే వీలుండటమే కంటైనర్ స్విమ్మింగ్ పూల్స్ ప్రత్యేకత. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/24.0

**వాతావరణం**
నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

# నేత్రపర్వంగా దుర్గా పూజ



బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని బంజారా ఫంక్షన్ హాల్‌లో దుర్గా పూజా వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అద్భుతమైన రీతిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం ఆకట్టుకుంటోంది. భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతున్నారు. బుధవారం పూజలను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెంగాలీలు అత్యంత వైభవంగా నిర్వహించేది దుర్గా పూజ ఉత్సవాలేనన్నారు. బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రంజిత్ పాల్ మాట్లాడుతూ.. ఈ నెల13 వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారికి పుష్పాంజలి జరుగుతుందన్నారు. బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్, బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ డాక్టర్ త్రిషీతా ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు. - బంజారాహిల్స్

## సరస్వతీ దేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ



బంజారాహిల్స్: సరస్వతీ దేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజామునే అభిషేకం, అర్చన, హోమం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమివ్వాలి




సమావేశంలో మాట్లాడుతున్న డా. పి.పి.వావా

లక్డీకాపూల్: ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే విధుల్లో నిమగ్నమై ఉండే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని సఫాయీ కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి.వావా సూచించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఆయన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, ఆయా విభాగాల అధికారులు, వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. పారిశుద్ధ్య కార్మికులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిశుభ్ర వాతావరణంలో విధులు నిర్వర్తించే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. క్రమం తప్పకుండా వారికి ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచిత వైద్య సేవలు అందించాలని సూచించారు. కనీస వేతనాలు అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని, బీమా సౌకర్యం, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సదుపాయాలు వర్తించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి సమాజం ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయా ప్రతినిధులు కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కమిషన్ సలహాదారు వీరేంద్రనాథ్, అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, పంకజ, నళినీ పద్మావతి, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, రవి కిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన విపత్తు నిర్వహణ ఎలా?

### దృష్టి పెట్టిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

- వివిధ రాష్ట్రాల్లోని విధానాలు అధ్యయనం
- విస్తృత స్థాయి సమీక్షలో పాల్గొన్న అధికారులు



సమావేశమైన హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వర్షాలు, వరదల సందర్భాల్లో చేపట్టాల్సిన విపత్తు నిర్వహణ చర్యలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి పెట్టింది. మెరుగైన విధానాన్ని అమలు చేయడానికి వివిధ రాష్ట్రాల్లో అమలులో ఉన్నవి అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం కర్ణాటక రాష్ట్ర ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ కేంద్రం మాజీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ శ్రీనివాస్‌రెడ్డితో భేటీ అయ్యారు. బుద్ధ భవన్‌లోని హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో విపత్తు నిర్వహణకు సంబంధించి బెంగళూరులో అనుసరిస్తున్న విధానాలపై శ్రీనివాస్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

- దేశంలోని ఇతర నగరాలు, పట్టణాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, మెరుగైన వ్యవస్థను రూపొందించడంపై అధికారులు దృష్టి పెట్టారు. కాగా.. మెరుగైన విపత్తు నిర్వహణతో పాటు ప్రజలను అప్రమత్తం చేసే వ్యవస్థ ఏర్పాటుపై రంగనాథ్ దృష్టి పెట్టారు. వాతావరణ కాలుష్యం, ఇతర కారణాలతో నెలలో పడాల్సి వర్షం.. ఒక్క రోజులో పడాల్సింది గంట, అరగంటలో కురుస్తుండటంతో తలెత్తుతున్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవడంపై హైడ్రా దృష్టి పెట్టింది. అనునిత్యం ప్రాంతాల వారీగా వాతావరణ నివేదిక ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని, ఎంత వర్షం పడుతుందో, వరద ముప్పు, వడగళ్లతో పాటు పిడుగుపాట్ల హెచ్చరికలు కూడా ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

**సమాచార సేకరణ ఎప్పటికప్పుడు..**

- గ్రేటర్ పరిధిలో డివిజన్ల వారీగా వాతావరణ స్టేషన్ల నుంచి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి క్రోడీకరిస్తూ వర్షపాత నమోదును, వరద ముప్పును అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేయడానికి కసరత్తు చేస్తోంది. రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా, ప్రవహించకుండా ఎక్కడికక్కడ వరద నీటి కాల్వల్లోకి వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వరదలు, ముంపు సంభవిస్తుందనే విషయం గ్రహిస్తూ అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం పైనా హైడ్రా అధికారులు దృష్టి పెట్టారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో వరద నీటి కాలువల ప్రవాహ స్థాయిని అంచనా వేసేందుకు బెంగళూరులో సెన్సార్లు అమర్చారు. వాటి పరితీరును అధ్యయనం చేయడంతో పాటు నాలాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలను హైడ్రా చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతం నగరంలో ఉన్న చెరువులకు అలుగులు ఉండేలా.. చెరువు నిండిన తర్వాత నీరు అలుగు ద్వారా ఇంకో చెరువుకు వెళ్లేలా గొలుసుకట్టు చెరువుల లింకును పునరుద్ధరించడం ద్వారా వరద నీరు ముందుకు వెళ్లేలా చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

# పల్లెకు చలో..

### సద్దుల బతుకమ్మ, దసరా సంబరాలు

- స్వగ్రామాలకు నగర వాసుల పయనం
- బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో జనం రద్దీ
- కొనుగోళ్లతో షాపింగ్ మాళ్లు కిటకిట

సాక్షి, సిటీబ్యూరో: పట్నం పల్లెకు పయనమైంది.. సద్దుల బతుకమ్మ, దసరా పండగలకు సొంతూరి బాట పట్టింది. బతుకుదెరువుకు నగరానికొచ్చిన వారంతా స్వగ్రామాలకు తరలివెళ్తున్నారు. ప్రయాణికులతో జేబీఎస్, ఎంజీబీఎస్, రైల్వే స్టేషన్లలో విపరీతమైన రద్దీ నెలకొంది. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమలులో ఉండటంతోనూ రద్దీ మరింత పెరిగింది. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీ బస్సుల్లో సీట్లు దొరక్కపోవడంతో ప్రయాణికులు అవస్థల పాలవుతున్నారు.

**వాళ్లు ఊరికి.. మేం షాపింగ్ మాల్‌కు..**

వివిధ ప్రాంతాలకు చెందిన వారంతా సొంతూళ్లకు వెళుతుంటే నగరవాసులు షాపింగ్ సందడిలో నిమగ్నమై పోయారు. దసరా పండగకు రెండు రోజులు మాత్రమే ఉండటంతో నగర వాసులంతా షాపింగ్ మాల్స్‌కు చేరుకుంటున్నారు. కొనుగోలుదారులతో కూకట్‌పల్లి, అమీర్‌పేట్, కోఠి, బంజారాహిల్స్,



జూబ్లీహిల్స్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని షాపింగ్ మాల్స్ కిక్కిరిసిపోతున్నాయి. కొత్త దుస్తుల కొనగోళ్లతో షాపింగ్ మాల్స్, బంగారు ఆభరణాల కోసం పంజాగుట్ట, సోమాజిగూడ, బంజారాహిల్స్, సికింద్రాబాద్, ఏఎస్ రావు నగర్ వంటి ప్రాంతాల్లోని జ్యువెల్స్ షాపులు కిక్కిరిసిపోతున్నాయి. సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని పూల మార్కెట్లు సైతం కిటకిటలాడుతున్నాయి. బతుకమ్మను తయారు చేయడానికి అవసరమైన విభిన్న రకాల పూలతో పాటు ఇతర సామగ్రి కొనుగోలుకు నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారు. శివారు గ్రామాల నుంచి నగరానికి అమ్మకానికి వచ్చిన తీరొక్క పూలతో నగరంలోని ఫుట్‌పాత్‌లన్నీ నిండిపోయాయి.

**సినిమా సందడి లేని దసరా..**

నగరంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో దసరా, సంక్రాంతి అంటే పండగ వాతావరణంతో పాటు కొత్త సినిమాల విడుదలతో సందడిగా ఉండేది. కానీ.. ఈసారి దసరా పండగకు పెద్ద సినిమాలేవీ విడుదల కాకపోవడంతో సినీ అభిమానులు నిరాశగా ఉన్నారు. నగరంలోని మల్టిప్లెక్స్‌లు, థియేటర్లు బోసిపోయి కనిపిస్తున్నాయి. కొన్ని మంచి చిత్రాలు కూడా ఓటీటీ వేదికగా విడుదల కావడంతో దసరాకు సినిమా సందడి లేకుండాపోయిందని సినీ ప్రియులు అంటున్నారు.



## సద్దుల బతుకమ్మ సంతోషాలు నింపాలి







సాక్షి, సిటీబ్యూరో: సద్దుల బతుకమ్మ పండగను పురస్కరించుకొని జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, కమిషనర్ ఆమ్రపాలి నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సామూహిక శక్తికి, ఐక్యతకు ప్రతిబింబం బతుకమ్మ పండగ అని ఆమ్రపాలి పేర్కొన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు ఈ పండగ ఎంతో ప్రత్యేకమైనదని, అందరి కుటుంబాల్లో సిరిసంపదలు, సుఖ సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ అస్తిత్వానికి, సాంస్కృతిక జీవనానికి ప్రతీక ఈ పండగని మేయర్ పేర్కొన్నారు.

## ‘మోబీస్ ఇండియా’ ఉదారత

### ఉస్మానియా ఆసుపత్రికి ఆధునిక వైద్య పరికరం అందజేత



పరికరాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆసుపత్రికి వచ్చే పేద రోగులను ఆదుకునేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకురావడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. మోబీస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ సౌజన్యంతో అత్యాధునికమైన సదుపాయాలతో కూడిన రూ.2.5 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాన్ని ఆ సంస్థ ప్రతినిధి చొసింగ్మిన్ ఉస్మానియా ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం కులీకుతుబ్‌షా భవనం 3వ అంతస్తులోని యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ మల్లికార్జున్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్‌ల నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమానికి చొసింగ్మిన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఎంఈ వాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ నరేందర్ కుమార్ పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, నెఫ్రాలజీ విభాగాధిపతి మనీషా సహాయ్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ నాగప్రసాద్‌లతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ-1 డాక్టర్ జయకృష్ణ, ఆర్ఎంఓలు రఫీ, కవిత, సిద్ధిఖీ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్, హరీష్‌రావులకు దుర్గమ్మ మంచి బుద్ధి ప్రసాదించాలి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



పూజలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఎల్బీనగర్: మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకు దుర్గామాత మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుకుంటున్నానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మంత్రి వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గమ్మ దేవాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత 50 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా హైదరాబాద్ నగరాభివృద్ధి కోసం జీహెచ్‌ఎంసీకి రూ.10వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లోనే 70 వేల ఉద్యోగాలు కల్పించిందన్నారు. సమావేశంలో రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, దేవాలయ చైర్మన్ సంరెడ్డి భుజంగరెడ్డి పాల్గొన్నారు.



**బల్దియాకు బతుకమ్మ శోభ**

బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయ వేటలో..

### భవనాల డీవియేషన్లు తనిఖీ చేస్తున్న అధికారులు

- అండర్ అసెస్‌మెంట్, వినియోగ మార్పిడులపై కొరడా
- ఆస్తిపన్ను పెంచుకునేందుకు బల్దియా చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: ఆదాయం పెంచుకునేందుకు వివిధ మార్గాలు అన్వేషిస్తోన్న జీహెచ్‌ఎంసీ.. ఆస్తిపన్ను పెంచుకునే చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా కొత్తగా భవన నిర్మాణం పూర్తి చేసిన వారు వెంటనే ఆస్తిపన్ను చెల్లించేలా, భవన వినియోగం మారిన వారు అందుకనుగుణంగా ఆస్తిపన్ను చెల్లించేలా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సర్కిళ్ల పరిధుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న బిల్ కలెక్టర్లు, డిప్యూటీ కమిషనర్లు ఆమేరకు జీహెచ్‌ఎంసీ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా నోటీసులు జారీ చేస్తున్నారు.

**సర్కిల్ అధికారులకు బాధ్యతల అప్పగింత..**

- జీహెచ్‌ఎంసీలో ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ అసెస్‌మెంట్‌ను అమల్లోకి తెచ్చాక, అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించడం దాదాపుగా మానేశారు. తద్వారా పలు ఇబ్బందులు ఉత్పన్నమవుతుండటంతో పాటు భవనాలకు వాస్తవంగా రావాల్సిన ఆస్తిపన్ను కంటే తక్కువ వస్తుండటంతో అసెస్‌మెంట్ చేసుకోని భవనాలను, వాస్తవ విస్తీర్ణం కంటే తక్కువ విస్తీర్ణానికే ఆస్తిపన్ను చెల్లిస్తున్న భవనాలను తనిఖీలు చేసి సరైన ఆస్తిపన్ను వసూలు చేసే బాధ్యతను సర్కిళ్లలోని అధికారులకు అప్పగించారు. దీంతో అసలే అసెస్‌మెంట్స్ చేసుకోనివారికి చేసుకోవాల్సిందిగా సుమోటోగా నోటీసులు జారీ చేస్తున్నారు.
- అలాగే ర్యాండమ్‌గా భవనాలను తనిఖీలు చేస్తూ, వాస్తవంగా అనుమతి పొందిన విస్తీర్ణం, ప్రస్తుత విస్తీర్ణం, అనుమతి పొందిన అంతస్తులు, అంతకంటే ఎక్కువగా వెలసిన అంతస్తులు తదితర డీవియేషన్లను గుర్తించి అందుకనుగుణంగా నోటీసులు జారీ చేస్తూ ఆస్తిపన్ను చెల్లించాల్సిందిగా సూచిస్తున్నారు. అంతేకాదు.. నివాస భవనంగా ఆస్తిపన్ను చెల్లిస్తున్న అనేక భవనాల్లో పలు వ్యాపారాలు నడుస్తున్నాయి. ఉదాహరణకు అశోక్‌నగర్, గాంధీనగర్, పద్మారావునగర్ వంటి ప్రాంతాల్లో పలు నివాస భవనాలు కోచింగ్ సెంటర్లుగా, హోటళ్లు, రెస్టారెంట్లతో కిటకిటలాడుతున్నాయి. ఇంకా అనేక దుకాణాలు నడుస్తున్నాయి. అలాంటి వాటిని తనిఖీలు చేసి వాణిజ్య భవనం కింద ఆస్తిపన్ను విధిస్తే జీహెచ్‌ఎంసీకి బోలెడు ఆదాయం పెరగనుంది.



**ఖజానాకా.. సొంత జేబుల్లోకా?**

తనిఖీలతో జీహెచ్‌ఎంసీ ఆదాయం భారీగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, నిజంగా అదంతా జీహెచ్‌ఎంసీ ఖజానాకు చేరుతుందా? లేక బిల్ కలెక్టర్ల జేబులు నిండటానికి ఉపయోగపడుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవనం వాస్తవ విస్తీర్ణం కంటే తక్కువ విస్తీర్ణం చూపినందుకు, వాణిజ్య భవనాన్ని నివాస భవనంగా గుర్తించినందుకూ గతంలో తమ ఆదాయం పెంచుకున్న బిల్ కలెక్టర్లు బల్దియాలో లెక్కకు మిక్కిలి ఉన్నారు. ఆ తతంగం నివారించాలనే ఉద్దేశంతోనే వారికి తనిఖీల బాధ్యతలు తప్పించారు. సెల్ఫ్ అసెస్‌మెంట్‌కు మాత్రమే అవకాశమిచ్చారు. కానీ.. దాని ద్వారా మరో రకమైన అక్రమాలు జరుగుతుండటం తదితరమైనవి పరిగణనలోకి తీసుకొని పాత అధికారాల్ని తిరిగి కట్టబెట్టారు. గతంలో మాదిరే వారి జేబులు నిండే కార్యక్రమం పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

**బెంగళూరు విధానం అధ్యయనం..**

ఆస్తిపన్ను పెంచుకునేందుకు వివిధ మార్గాలు అన్వేషిస్తున్న అధికారులు బెంగళూరులో ఆస్తిపన్ను విధానాన్ని ఇటీవల పరిశీలించారు. అక్కడ భవన నిర్మాణం పూర్తయ్యాక అసెస్‌మెంట్ చేయించుకోకుండా ఉంటే నెలనెలా విధించే పెనాల్టీ ఎక్కువగా ఉండటం తదితరమైనవి గుర్తించారు. ప్రస్తుతం వాటి పరిశీలనలో ఉన్నారు. జీహెచ్‌ఎంసీకి ఉపకరించే విధానం ఏదైనా ఉంటే అమలు చేసే యోచనలో ఉన్నారు.

## 20న కేబీఆర్ పార్కులో ‘ప్రజా సంబరాలు’

లక్డీకాపూల్: తెలంగాణ సంస్కృతి, వారసత్వ సంపద తెలిసేలా ప్రజా సంబరాలు నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 20న కేబీఆర్ పార్కులో ప్రజా సంబరాలు పేరిట సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన పోస్టర్‌ను జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా మన సంస్కృతి, వారసత్వ సంపద తెలిసేలా ప్రజా సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారన్నారు. నగర సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, గ్రీనరీ వంటి అంశాలపై ఆయన ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని చెప్పారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్లు నళినీ పద్మావతి, పంకజ, వేణుగోపాల్‌రెడ్డి, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి పాల్గొన్నారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్, అధికారులు

# రూ.2500 గిన్నె చూపించి..
# రూ.25 లక్షలు స్వాహా!

- మార్కెట్‌లో దీనికి రూ.10 కోట్ల ధరంటూ ఎర
- రైస్ పుల్లర్ పేరు చెప్పి ముగ్గురు కేటుగాళ్ల దందా
- అరెస్టు చేసిన ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ టీమ్



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

సాక్షి, సిటీబ్యూరో: గతంలో రైస్ పుల్లింగ్ గ్యాంగ్స్ చేతిలో మోసపోయిన ముగ్గురు వ్యక్తులు మోసగాళ్ల అవతారం ఎత్తారు. వీళ్లూ వరుసపెట్టి మోసాలు చేయడం ప్రారంభించారు. రూ.2500 విలువ చేసే రాగి గిన్నెకు అతీంద్రియశక్తులున్నాయని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.25 లక్షలు కాజేశారు. మరో రూ.23 లక్షలు స్వాహా చేయడానికి ప్రయత్నిస్తుండగా ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు వలపన్ని పట్టుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర బుధవారం తెలిపారు. రైస్ పుల్లర్లుగా పిలిచే ఇరీడియం నాణేల పేరుతో మోసం చేసే ముఠాలు గతంలో అనేకం ఉండేవి. 2015లో ఇలాంటి ఓ గ్యాంగ్ బారినపడిన స్నేహితులు ఓల్డ్ అల్వాల్ వాసి పి.శివసంతోష్ కుమార్, ఏపీలోని పలమనేరుకు చెందిన జి.మంజునాథ్‌రెడ్డి, బెంగళూరు వాసి ప్రతాప్ ఎస్సార్ రూ.5 లక్షలు నష్టపోయారు. దీంతో తామూ అదే పంథాలో మోసాలు చేయాలని నిర్ణయించుకుని రంగంలోకి దిగారు. మంజునాథ్‌రెడ్డి రాగి గిన్నెను కొని తన వద్ద ఉంచుకున్నాడు. దీనికోసం ఓ గాజు బాక్సు, చుట్టూ థర్మకోల్ షీట్లు పెట్టి అదేదో అద్భుత వస్తువు అన్నట్లు రూపొందించాడు. నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ తనకు పరిచయమైన వారితో రైస్ పుల్లర్స్ పేరుతో ఎర వేసేవాడు. అతీంద్రియశక్తులు ఉన్న ఈ గిన్నెలు ఎవరి వద్ద ఉంటే వాళ్లు కోటీశ్వరులు అవుతారని, వివిధ రకాలైన ప్రయోగాల్లో వినియోగించే ఆ గిన్నెలకు భారీ రేటు ఉంటుందని నమ్మించేవాడు. ఇలానే ఇతడికి సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన శశికాంత్‌ను నమ్మబలికాడు. ఆ పాత్రను రూ.10 కోట్లకు ఖరీదు చేయడానికి అంతర్జాతీయ సంస్థ అయిన అప్రిచెస్ అండ్ రీసెర్చ్ సిద్ధంగా ఉందని చెప్పాడు. సికింద్రాబాద్‌లోని ఓ హోటల్ వద్ద శశికాంత్‌ను కలిసిన శివ సంతోష్ తాను సదరు కంపెనీ ఉద్యోగిగా పరిచయం చేసుకున్నాడు. బెంగళూరులోని డీఆర్‌డీఓ నుంచి స్కానింగ్ మిషన్ తీసుకువచ్చి, ఈ పాత్రను స్కానింగ్ చేయించి, సైంటిస్టు నుంచి సర్టిఫికెట్ పొందాలని చెప్పాడు. అప్పుడు రంగంలోకి దిగిన ప్రతాప్ డీఆర్‌డీఓలో పని చేసే సైంటిస్ట్ రవీంద్ర ప్రసాద్‌గా శశికాంత్‌కు పరిచయం అయ్యాడు. స్కానింగ్, సర్టిఫికేషన్ కోసం రూ.25 లక్షలు ఖర్చవుతాయని చెప్పాడు. ఇలా ముగ్గురి మాటలు నమ్మిన బాధితుడు ఈ నెల 6న వారికి రూ.25 లక్షలు చెల్లించాడు. అయినప్పటికీ స్కానింగ్ మిషన్ తీసుకురాని మంజునాథ్ కాలయాపన చేస్తూ వచ్చాడు. అదేమిటంటూ నిదీయగా... మరో రూ.23 లక్షలు అవసరమని చెప్పాడు. వీరి వ్యవహారంపై అనుమానం వచ్చిన శశికాంత్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మార్కెట్ ఠాణాలో కేసు నమోదైంది. వీరి వ్యవహారంపై నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ కె.సైదులు నేతృత్వంలో రంగంలోకి దిగిన ఎస్సైలు పి.గగన్‌దీప్, శ్రీనివాసులు దాసు వలపన్ని ముగ్గురినీ పట్టుకున్నారు. వీరి నుంచి రూ.25 లక్షల నగదు, రాగి గిన్నె తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. 2016 నుంచి ఈ తరహా మోసాలు చేస్తున్న ఈ గ్యాంగ్ ఇప్పటి వరకు దాదాపు రూ.10 కోట్లు కాజేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఎవరూ ముందుకు వచ్చి ఫిర్యాదు చేయకపోవడం వీరికి కలిసి వచ్చింది.

## తెలంగాణ వారసత్వ పండగ బతుకమ్మ: కలెక్టర్

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ వారసత్వ పండుగ బతుకమ్మ అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో బుధవారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. తొలుత బతుకమ్మకు పూజా కార్యక్రమాలు నిర్వహించి మహిళా శిశు సంక్షేమ శాఖ, ఇతర శాఖల మహిళా ఉద్యోగినులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ బతుకమ్మ ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ శాఖలు రంగు రంగుల బతుకమ్మలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఈ.వెంకటాచారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లావణ్య, ఎస్‌ఈ ఎం.జ్యోతి, సీపీఓ డాక్టర్ సురేందర్, జిల్లా బీసీ అధికారి జి.ఆశన్న, ఏవో సదానందం, తహసీల్దార్లు హేమలత, మమత, వెంకట లక్ష్మి, సునీత, మహిళా శిశు సంక్షేమ శాఖ, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పీజీ సీట్లు పొందినవారి రెండో జాబితా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు ఇతర వర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో సీట్లు సాధించిన విద్యార్థుల రెండో జాబితాను బుధవారం ప్రకటించారు. టీజీ సీపీజీఈటీ–2024 రెండో విడత కౌన్సెలింగ్‌లో 22546 మంది అభ్యర్థులు ఆప్షన్స్ ఇవ్వగా..13417 మంది విద్యార్థులకు సీట్లను కేటాయించారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ఇతర పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో సీట్లు లభించిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో ఈ నెల 17 వరకు రిపోర్టు చేయాలని అధికారులు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

# అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్ట్

- కర్ణాటకలో పేరుమోసిన నిందితుడు
- ఇప్పటికే 74 కేసులు నమోదు
- ఇటీవల చైతన్యపురి, జవహర్‌నగర్‌లలో స్నాచింగ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ అరవింద్ బాబు, ఇన్‌సెట్‌లో స్వాధీనం చేసుకున్న బంగారు చైన్లు

చైతన్యపురి: కర్ణాటక రాష్ట్రానికి చెందిన అంతర్రాష్ట్ర చైన్‌స్నాచర్‌ను చైతన్యపురిలో అరెస్ట్ చేశారు. రాచకొండ క్రైం డీసీపీ వి.అరవింద్‌బాబు బుధవారం చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో క్రైం అడిషనల్ డీసీపీ ఎం.శ్రీనివాసులు, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావులతో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 30న అల్కాపురిలో లక్ష్మీ సుజాత అనే మహిళ మెడలోని మూడు తులాల బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన అగంతకుడు లాక్కుని పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. స్పెషల్ క్రైం టీంను ఏర్పాటు చేసి సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారంతో బుధవారం మోహన్‌నగర్‌లో బైక్‌పై వస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. కర్ణాటకలోని దర్వాడ జిల్లా హుబ్లీ తాలూకా కొలివాడకు చెందిన సమ్మన్న కొలివాడి అలియాస్ విశ్వనాథ్(34)గా గుర్తించారు. ఇతను కర్ణాటకలో పేరుమోసిన స్నాచర్ అని, 74 కేసులలో నిందితుడుగా ఉన్నట్లు గుర్తించారు. చైతన్యపురిలో స్నాచింగ్ జరిగిన రోజే జవహర్‌నగర్ పీఎస్ పరిధిలోనూ మరో స్నాచింగ్ చేసినట్లు విచారణలో నిందితుడు అంగీకరించినట్లు డీసీపీ తెలిపారు. నిందితుడి నుంచి రెండు బంగారు గొలుసులు(ఆరు తులాలు), రూ.2.5 లక్షల నగదు, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**నిందితుడి నేరచరిత్ర...**

వృత్తిరీత్యా డ్రైవర్ అయిన విశ్వనాథ్ జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదన కోసం 2015 నుంచి స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడు. కర్ణాటక రాష్ట్రంలో మొత్తం 33 పోలీస్ స్టేషన్‌లలో సుమారు 74 స్నాచింగ్ కేసులలో ఇతను నిందితుడు. 2018లో అక్కడి పోలీసులకు పట్టుబడి నాలుగున్నర సంవత్సరాలు జైలులో ఉన్నాడు. ఇప్పటికి పది కేసులలో నిందితుడిగా ఉన్న అతని కోసం అక్కడి పోలీసులు వెతుకుతున్నారు. బైక్‌పై ఒంటరిగా వెళ్తూ మహిళల మెడలోని గొలుసులు లాగటంలో విశ్వనాథ్ దిట్ట. క్షణాల్లో వేగంగా బైక్‌పై పరారవుతాడు. ఈ ఏడాది జైలు నుంచి బయటకు వచ్చి మే నెలలో హైదరాబాద్‌కు వచ్చి చిక్కడపల్లిలో, కొన్ని రోజులు జవహర్‌నగర్ ప్రాంతంలో నివసించాడు. అనంతరం మహారాష్ట్ర వెళ్లి కొత్త బైక్ కొని అదే బైక్‌పై రెండు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాచకొండ క్రైం పోలీసులు నిందితుడిని ఆటకట్టించారు. కేసు ఛేదించటంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, విజయ్, చైతన్యపురి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గురుస్వామిలను అభినందించిన డీసీపీ వారికి రివార్డు అందజేశారు.



# ఈ 'టీ'తో నష్టాలే!

- ప్రమాదకర రసాయనాలు వినియోగించి తయారీ
- గుట్టురట్టు చేసిన సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్
- 300 కేజీల కల్తీ టీ పొడి, ఫ్లేవర్స్ తదితరాలు సీజ్



సాక్షి, సిటీబ్యూరో: నాసిరకమైన టీ పొడిలో కొబ్బరి చిప్ప పొడి, రసాయనాలు, రంగులు, చాక్లెట్ ఫ్లేవర్, మిల్క్ పౌడర్ కలిపి కల్తీ టీ పొడి తయారు చేస్తున్న ముఠాకు మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. ముగ్గురు నిందితులను పట్టుకుని వారి నుంచి 300 కేజీల కల్తీ టీ పొడి, 200 కేజీల కొబ్బరి చిప్పల పొడి స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర బుధవారం తెలిపారు. ఫతేనగర్‌కు చెందిన జగన్నాథ్ కోణార్క్ టీ పౌడర్ సేల్స్ అండ్ సప్లయర్స్ పేరుతో వ్యాపారం చేస్తున్నాడు. తేలిగ్గా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కల్తీ టీ పొడి తయారీకి సిద్ధమయ్యాడు. మార్కెట్ నుంచి కేజీ రూ.80 ఖరీదు చేసే టీ పొడి, రసాయనాలు, రంగులు, ఫ్లేవర్స్‌తో పాటు కొబ్బరి చిప్పల పొడి కొనేవాడు. దీన్ని తన దుకాణానికి తీసుకువెళ్లి తన వద్ద పని చేసే ప్రతాప్, పరాదాలకు ఇచ్చే వాడు. వీళ్లు వాటన్నింటినీ కలిపి కల్తీ టీ పొడి తయారు చేసి ప్యాక్ చేసే వారు. ఈ పొడిని కేజీ రూ.250కి అమ్మే జగన్నాథ్ లాభాలు ఆర్జిస్తున్నాడు. ఈ టీ పొడిని ఎక్కువగా చిన్న చిన్న దుకాణదారులతో పాటు రోడ్డు పక్కన టీ స్టాల్స్‌కు అమ్మేవాడు. వీరి వ్యవహారంపై సమాచారం అందుకున్న మధ్య మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామకృష్ణ నేతృత్వంలో ఎస్సై డి.శ్రీకాంత్ గౌడ్ వలపన్ని ముగ్గురినీ పట్టుకున్నారు. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న సరుకును సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు. జగన్నాథ్‌పై ఇప్పటికే మోమిన్‌పేట్, సనత్‌నగర్ ఠాణాల్లో మూడు ఇదే తరహా కేసులు ఉన్నాయని, అయినప్పటికీ అతడు తన పంథా కొనసాగుస్తున్నాడని డీసీపీ తెలిపారు. కల్తీ పొడితో చేసిన టీ తాగడం వల్ల కేన్సర్, కామెర్లు సహా అనేక వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

# ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు

కాచిగూడ: ఆటో కార్మికులకు కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరింత తీవ్రం చేస్తామని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ ప్రతినిధులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం నారాయణగూడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆటో డ్రైవర్ల డిమాండ్ల సాధనకోసం నవంబర్ 5న హైదరాబాద్, ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే 'మహాధర్నా' వాల్ పోస్టర్‌ను జేఏసీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఆటో రిక్షా డ్రైవర్‌కు ఏడాదికి రూ.12వేలు ఆర్థిక సహాయం, అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత, పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్లకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకం ద్వారా 50 శాతం తగ్గింపుతో క్లియర్ చేస్తామని హామీలు ఇచ్చి విస్మరించడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు బి.వెంకటేశం, సీహెచ్.జంగయ్య, ఎస్.అశోక్, ఏ.భిక్షపతి యాదవ్ (ఏఐటీయూసీ), వి.మారయ్య (బీఆర్‌టీయూ), పి.శ్రీకాంత్ (సీఐటీయూ), లింగం గౌడ్ (ఐఎఫ్‌టీయూ), వి.ప్రవీణ్ (టీయూసీఐ), డి.శ్రీనివాస్ (జీయూటీఎస్), ఎం.ఎ.సలీమ్ (యూటీఏడీడబ్ల్యూఏ), ఏ.సత్తిరెడ్డి (టీఏడీఎస్), మీర్జా రఫాత్ బేగ్ (ఆటో ఓనర్స్ అసోసియేషన్) పాల్గొన్నారు.

# నక్సల్స్ పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్న ముఠా అరెస్టు



పోలీసులకు పట్టుబడ్డ వ్యక్తులు

లాలాపేట: నిషేధిత నక్సలైట్ సంస్థ జై భీమ్ గ్రూప్ పేరుతో బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న ఓ ముఠాను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తార్నాకలోని కళాకృతి అపార్టుమెంట్ నివాసి రైల్వే కాంట్రాక్టర్ జి.సురేష్‌కు గత నెల 26న కొందరు వాట్సాప్ కాల్ చేసి తాము సీపీఐ ఎంఎల్ గ్రూప్ నుంచి మాట్లాడుతున్నామని, తమకు రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే మిమ్మల్ని, మీ కుటుంబ సభ్యుల్ని హతమారుస్తామంటూ బెదిరించారు. పోలీసులకు సమాచారం ఇస్తే మీ అంతు చుస్తామని, 12 గంటల వ్యవధిలో డబ్బులు ఏర్పాటు చేయాలని ఫోన్ పెట్టేశారు. తర్వాత రోజు మరో నెంబర్‌తో రెండు పర్యాయాలు ఫోన్ చేశారు. కానీ సురేష్ స్పందించకపోవడంతో వాట్సప్‌లో మెసేజ్‌లు పెట్టి బెదిరించారు. దీంతో సురేష్ గత నెల 30న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫోన్ నెంబర్ అడ్రస్ ఆధారంగా కాప్రాకు చెందిన మొదట సలోంక ప్రసాద్‌ను పట్టుకుని విచారించగా..అతను తెలిపిన వివరాలతో బెదిరింపుల పర్వంలో పాల్గొన్న రత్లావత్ రవినాయక్, కమ్మరి శేషప్ప, మందగుల సత్తయ్యలను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి సెల్‌ఫోన్, సిమ్ కార్డులు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నారు.

# స్పెషల్ బ్రాంచ్ పనితీరు ప్రశంసనీయం

రాచకొండ కమిషనర్ జి.సుధీర్‌బాబు



సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ స్పెషల్ బ్రాంచ్ విభాగం అద్భుతంగా పని చేస్తోందని కమిషనర్ జి.సుధీర్‌బాబు కొనియాడారు. వివిధ విభాగాల క్షేత్రస్థాయి సిబ్బందికి, పోలీస్ విభాగాలకు అవసరమైన తోడ్పాటు అందిస్తూ నేరశాతం తగ్గింపునకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈమేరకు స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో నేరేడ్ మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పాస్ పోర్ట్ వెరిఫికేషన్, జాబ్ వెరిఫికేషన్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్స్ వంటి అనుమతుల జారీలో ఎస్‌బీ పోలీసులు సమర్థవంతంగా, వేగవంతంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వీరికి మరింత ప్రోత్సాహం అందించేందుకు స్పెషల్ బ్రాంచ్ జోన్ల అధికారులు, వివిధ విభాగాల సిబ్బందికి ట్యాబ్‌లు, లాప్‌ట్యాప్‌లు, ప్రింటర్లు, స్కానర్లు, హార్డ్ డిస్కుల వంటి అత్యాధునిక సాంకేతిక పరికరాలను అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కరుణాకర్, ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అశోక్, మన్మోహన్, స్వామి, వెంకటేశ్వర్లు, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చీటీ డబ్బులు ఇవ్వనందుకే హత్య

నిందితుడి రిమాండ్



నిందితుడు షేక్‌జావీద్

బంజారాహిల్స్: శ్రీనగర్‌కాలనీ సమీపంలోని నవోదయ కాలనీలో ఓ గృహిణిని కత్తితో మెడ కోసం దారుణంగా హత్య చేసిన నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..శ్రీనగర్ కాలనీ నవోదయకాలనీలో నివసించే సుధారాణి (44)ను గత నెల 30వ తేదీన సాయంత్రం షేక్‌జావీద్ అలియాస్ జావీద్‌ఖాన్ అలియాస్ ఆమేర్‌అలీ(34) దారుణంగా హత్య చేసి పరార్ కాగా పోలీసులు పక్కా ఆధారాలతో మంగళవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఖాజీపేటకు చెందిన షేక్‌జావీద్ ఆటోడ్రైవర్. విద్యానగర్‌లో ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. 2022లో నిందితుడికి సుధారాణితో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి తరచూ కలుసుకునేవారు. సుధారాణి వద్ద రూ.2.8 లక్షలు చీటీలు కూడా వేశాడు. ఈ డబ్బులు ఇవ్వాలని జావీద్ అడగగా..ఆమె కోపం పట్టలేక పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెడతానని బెదిరింపులకు పాల్పడింది. దీంతో అడ్డు తగిలించుకోవడానికే పథకం ప్రకారం హత్య చేసినట్లు నిందితుడు వెల్లడించాడు. గత నెల 23వ తేదీన సికింద్రాబాద్‌లో రూ.70 వెచ్చించి కత్తి కొనుగోలు చేశాడు. అదేరోజు సాయంత్రం ఆమెను హత్య చేసేందుకు రాగా కుదరలేదు. ఆ తర్వాత వరుసగా రెండు రోజులు వచ్చినా పరిస్థితులు అనుకూలించకపోవడంతో వెనుదిరిగాడు. గత నెల 30న పక్కా పథకంతో ఆమెను హత్య చేసి ఆభరణాలతో పరారయ్యాడు. నిందితుడి నుంచి ఒక కారు, బైక్, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# మర్మాంగాలు కోసి..వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన మాలాద్రి (ఫైల్)

చందానగర్: ఓ వ్యక్తిని పురుషాంగాలు కోసి దారుణంగా హత్య చేసిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి తెలిపిన ప్రకారం నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం దారకామనిపాడు గ్రామానికి చెందిన తన్నీరు మాలాద్రి (36) భార్య మాధవితో కలిసి ఆరేళ్లుగా శేరిలింగంపల్లి తారానగర్‌లో ఉంటున్నాడు. సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. మాలాద్రి ఇంటి పక్కనే సోదరి అరుణ కూడా నివాసముంటున్నారు. కాగా అతని భార్య మాధవి సెప్టెంబర్ 30న తన సొంత గ్రామంలో బంధువుల పెళ్లి ఉండడంతో పిల్లలతో కలిసి ఊరెళ్లింది. మంగళవారం మాలాద్రి ఉదయం ఇంట్లోనే ఉన్నాడు. సాయంత్రం 6 గంటలకు అతని సోదరి అరుణ పిలిస్తే పలకలేదు. నిద్రపోయి ఉంటాడని ఆమె వెళ్లిపోయింది. 6.30 గంటలకు ఫోన్ చేయగా తీయకపోవడంతో వారు మళ్లీ ఇంటికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో పడి ఉన్నాడు. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడని, మర్మాంగాలు కోసి ఉన్నాయని ధృవీకరించారు. దీంతో అర్ధరాత్రి చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సీఐ పాలవెల్లి, క్లూస్ టీం సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

# మాదిగలకు ద్రోహం చేసేందుకే నియామకాలు

రేవంత్ సర్కార్‌పై మందకృష్ణ మాదిగ ధ్వజం



పార్శిగుట్ట నుంచి ర్యాలీగా వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బౌద్ధనగర్: ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం మాలలకు ఉద్యోగాలన్నీ దోచిపెట్టే కుట్రనేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. బుధవారం పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయం నుంచి ఇందిరా పార్క్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయడానికి ర్యాలీగా వెళ్తున్న మందకృష్ణ మాదిగతో పాటు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను ఇందిరా పార్క్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. అంతకుముందు ర్యాలీలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు చేస్తున్నది ముమ్మాటికీ ద్రోహమేనన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం అన్యాయమని మండిపడ్డారు. ఇచ్చిన మాట మీద నిలబడేతత్వం రేవంత్‌రెడ్డికి లేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తే 11 వేల టీచర్ పోస్టులలో 1,250 పోస్టులు మాదిగ నిరుద్యోగులకు లభించేవని ఇప్పుడు కనీసం 400 పోస్టులు కూడా మాదిగలకు లభించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలులోకి తీసుకొచ్చేంతవరకు ఉద్యోగ నియామకాలన్నీ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మాదిగ జాతికి తీవ్ర అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నెల 15న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఈ ర్యాలీలో ఎమ్మార్పీఎస్ నాయకులు గోవింద్ నరేశ్, తిప్పారపు లక్ష్మణ్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.